

ఊపిరాడకుండా చేసి

కట్టుకున్న భర్తనే కడతేర్చింది.. తన నుదిటి బొట్టును తానే తుడిచేసుకుంది. ఊపిరాడకుండా చేసి అంతమొందించింది. 8లో▸



వాలీబాల్ పోటీలకు..

జాతీయ వాలీబాల్ పోటీలకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అకాడమీ నుంచి ఆరు గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. 8లో▸



ఎక్సలెన్స్ అవార్డు

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించినందుకు ఉత్తమ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు చేవెళ్లలో మంత్రుల పర్యటన

చేవెళ్ల: మండలంలో బుధవారం మంత్రుల చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉండనున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మండలంలోని ముడిమ్యాల నుంచి రావులపల్లి, మెడిపల్లి మీదుగా ప్రొద్దటూరు గేట్ వరకు వేసే రోడ్డుకు శంకుస్థాపన, చేవెళ్ల మండల కేంద్రంలో పీఏసీఎస్ గోదాం, పీఏసీఎస్ కార్యాలయ భవనాల ప్రారంభోత్సవాలు ఉంటాయని పేర్కొంది. ఆయా కార్యక్రమాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద నిరాశ్రయులు, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలు అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆహారభద్రత కార్డు రెండు లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు ఆదాయం మించకూడదన్నారు. వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలు మించరాదన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టేలరింగ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగి ఉండలన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు మైనార్టీ క్రిస్టియన్ మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిందితులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదు

- పథకం ప్రకారమే నాగమణి హత్య
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



నాగమణి భర్త శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ఇబ్రహీంపట్నం: కుట్రపూరిత పథకం ప్రకారమే కానిస్టేబుల్ నాగమణిని దారుణంగా హతమార్చారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆరోపించారు. రాయపోల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి కులాంతర వివాహం చేసుకుందన్న కక్షతో గత నెల 2న దారికాచి సొంత తమ్ముడే హత్యచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య మంగళవారం రాయపోల్ గ్రామానికి చేరుకుని నాగమణి భర్త శ్రీకాంత్, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత సోదరుడే నాగమణిని హత్య చేయడం బాధాకరమని అన్నారు. హత్య కేసుతో సంబంధం ఉన్న వారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులను రెండు రోజుల్లో అరెస్టు చేయాలని రాచకొండ సీపీని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి భూమి, ఇల్లు ఇచ్చి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, తహసీల్దార్ సునీత రెడ్డి తదితరులు ఉన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

తుక్కుగూడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి హెచ్ఎంను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ విద్యా బుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గోపాల్‌నాయక్, యాదయ్య, చైతన్య, శంకర్, కల్పన, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్లాట్లు.. ఏర్పాట్లు

భూములు కోల్పోయిన రైతులకు కేటాయింపు



వెంచర్‌లో కొనసాగుతున్న పనులు

- వెంచర్‌లో తుది దశకు చేరిన పనులు
- ఒక కుటుంబానికి ఒకే దగ్గర ఇచ్చేలా చర్యలు
- నేటి నుంచి గ్రామాల్లో జాబితా ప్రదర్శన
- సంక్రాంతి తర్వాత అప్పగించే అవకాశం

కందుకూరు: ఫార్మాసిటీలో (ప్రస్తుత ఫ్యూచర్ సిటీ) భూములు కోల్పోయిన రైతులకు కేటాయిస్తున్న ప్లాట్లకు సంబంధించి అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రభుత్వం నిర్మిస్తున్న వెంచర్ పనులు దాదాపు కొలిక్కి వచ్చాయి. ఒక్కో కుటుంబానికి దక్కే ప్లాట్లు అన్నీ ఒకే దగ్గర కేటాయించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా భూములు సేకరించిన గ్రామాల్లో బుధవారం నుంచి ప్లాట్ల లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఆయా గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో జాబితాను ప్రదర్శించనున్నారు.



గతంలో వెంచర్‌లోకి చేరుకునేలా నిర్మించిన వంద అడుగుల రహదారి

ఇప్పటికే సర్టిఫికెట్ల జారీ

ఫార్మాసిటీ ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వ హయాంలో కందుకూరు, యాచారం మండలాల్లో దాదాపుగా 14 వేల ఎకరాల వరకు భూములు సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారంతో పాటు అదనంగా ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించడానికి గతంలోనే సర్టిఫికెట్లు జారీ చేసింది. వారి కోసం బేగరికంచె సమీపంలో 620 ఎకరాల్లో మెగా వెంచర్ నిర్మాణాన్ని చేపట్టింది. ఆ పనులు చివరి దశకు చేరాయి. ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించడానికి ఏర్పాట్లు చేస్తోంది. కందుకూరు ఆర్డీఓ పరిధిలో 1,580 మందికి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ పరిధిలో 3,900 మందికి ప్లాట్ల సర్టిఫికెట్లు జారీ చేశారు. ప్రస్తుతం వారికి ప్లాట్లను కేటాయించాల్సి ఉంది.

విస్తీర్ణం ప్రకారం..

ఎకరం లోపు ఉన్న వారికి 60 గజాల చొప్పున, ఎకరానికి 121 గజాల చొప్పున, ఆపైన ఉన్న వారికి విస్తీర్ణాన్ని బట్టి ప్లాట్లను కేటాయించనున్నారు. గతంలో ఎవరి పేరుతో భూమి సేకరిస్తే ఆ భూమి మేరకు ప్లాట్ల సర్టిఫికెట్లు కేటాయించారు. ప్రస్తుతం అధికారులు మాత్రం ఒక కుటుంబంలో ఎంత మందికి ప్లాట్లు ఇస్తున్నారో, అందరికీ ఒకే చోట ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కొత్త సమస్య వచ్చే ఆస్కారం ఉంది. కుటుంబ సభ్యుల్లో ఒకరికొకరు పడకపోతే సమస్య ఏర్పడనుంది. ఒకరికి 60 గజాలు, మరొకరికి 121, మరొక సభ్యుడికి 242 గజాల సర్టిఫికెట్లు ఉంటే అన్నీ కలిపి 423 గజాలు ఒకే దగ్గర కేటాయించనున్నారు. దీంతో ఎవరు ఎక్కడ పంచుకోవాలో అర్థం కాక కొత్త చిక్కులు ఏర్పడనున్నాయి. అందరూ కలిసి ఉండే కుటుంబాల్లో మాత్రం ఒకే దగ్గర ఇవ్వడం సంతోషం కలిగించనుంది. సంక్రాంతి తర్వాత ప్లాట్ల కేటాయింపు జరగనున్నట్లు సమాచారం.

అభ్యంతరాలుంటే చెప్పండి

ఫార్మాసిటీలో భూములు కోల్పయిన రైతులకు ప్లాట్ల పంపిణీ కోసం గ్రామాల వారీగా లిస్టును భూసేకరణ చేసిన గ్రామాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు ఆర్డీఓ పరిధిలో మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం, అన్నోజిగూడ, బేగరికంచె, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి గ్రామలకు చెందిన రైతులకు కేటాయిస్తున్న ప్లాట్ల వివరాలను ఆయా గ్రామాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే వారం రోజుల్లో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు.

ఎదురుచూస్తున్నాం..



యాచారం మండలం నానక్‌నగర్ పరిధిలో మా కుటుంబానికి చెందిన నాలుగు ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం తీసుకుంది. పరిహారం కింద ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో ప్లాట్లు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చి ఎనిమిది నెలలు అవుతోంది. ఇంత వరకు ప్లాట్లు ఇవ్వలేదు. ఎదురుచూస్తున్నాం. త్వరగా కేటాయించాలి.

– కె.వెంకటేశ్వర్లుగుప్తా, కందుకూరు

ఒకే చోట ఇస్తే మంచిదే..



ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే ప్లాట్లు ఒక్కో కుటుంబానికి అంతా కలిపి ఒకే దగ్గర కేటాయిస్తే మంచిదే. కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట ఇస్తే పెద్ద ప్లాటుగా ఉండడంతో భవిష్యత్‌లో ధర బాగా పలుకుతుంది. హైరైజ్ అపార్టుమెంట్ల వంటి వాటికి సులభంగా అనుమతులు వస్తాయి. ఒకే దగ్గర కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం.

– ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, సాయిరెడ్డిగూడ

పల్లె పోరుకు రెడీ

ఏర్పాట్లు పూర్తి చేస్తున్న యంత్రాంగం

- బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు పూర్తి
- సర్పంచ్ ఓటుకు గులాబీ, వార్డు మెంబర్‌కు తెలుపు రంగు పత్రాలు
- ఓటరు జాబితా, గుర్తుల ఖరారు
- బీసీ రిజర్వేషన్ల ప్రకటనే తరువాయి
- ఆ వెంటనే ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం



మండలాలు	21
గ్రామ పంచాయతీలు	549
వార్డులు	4,896
పురుషులు	3,99,404
మహిళలు	3,95,216
ఇతరులు	33
మొత్తం ఓటర్లు	7,94,653

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పల్లె పోరుకు సర్వం సన్నద్ధమైంది.ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ప్రకటించడమే ఆలస్యం.. ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సవ రణ, పోలింగ్ కేంద్రాల ఎంపిక, తుది ఓటర్ల జాబి తా ప్రకటన వంటి పనులు పూర్తయ్యాయి. బ్యాలెట్ బాక్సులను సైతం రెడీ చేశారు. సర్పంచ్ స్థానాలకు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా 30 గుర్తులు, వార్డు సభ్యుల కోసం 20 గుర్తులను ఈసీ ఖరారు చేసింది. సర్పంచ్ పోలింగ్‌కు పింక్ (గులాబీ) కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేశారు. వీటి ముద్రణకు టెండర్లు కూడా ఖరారయ్యాయి.

ప్రకటన రావడమే ఆలస్యం

జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సమగ్ర సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు చేయాలని భావిస్తోంది. ఇంటింటి సర్వేలో భాగంగా కులాల వివరాలను కూడా సేకరించింది. ఈ డేటా కంప్యూటరీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. బీసీ కమిషన్ ద్వారా ఈ నివేదిక ప్రభుత్వానికి త్వరలోనే అందనుంది. ఈ రిజర్వేషన్ల ప్రకటన రావడమే ఆలస్యం.. జిల్లాలోని 549 గ్రామ పంచాయతీలు, 4,896 వార్డులకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. వీటి పరిధిలో మొత్తం 7,94,653 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3,99,404 మంది పురుషులు, 3,95,216 మంది మహిళలు, 33 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. నిజానికి గతేడాది జనవరి చివరి నాటికే కొత్త పాలక వర్గాలు కొలువుదీరాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి, ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్ని కలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

తగ్గనున్న జీపీలు

పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులను నియమించనున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో పంచాయతీల సంఖ్య 558 నుంచి 549కి తగ్గింది. ఇదే సమయంలో మెయినాబాద్, చేవెళ్ల కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. మరో వైపు మహేశ్వరం, కందుకూరు కేంద్రంగా రెండు మున్సిపాలిటీలు ఏర్పాటవుతాయనే ప్రచారం కూడా లేకపోలేదు. ఇదే జరిగితే.. జిల్లాలో పంచాయతీల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది.

గుర్తులు ఖరారు

సర్పంచ్‌లను ఎన్నుకునేందుకు బ్యాలెట్ పత్రంలో చేతికర్ర, మంచం, డోర్ హ్యాండిల్, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్ బ్యాటరీ, లైట్, బ్రష్, పడవ, చైను, చెప్పులు, గాలిబుడగ, కత్తెర, స్టంప్స్, టూత్‌పేస్ట్, రిమోట్, బ్యాట్, ఉంగరం, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, పాన్, చెత్తడబ్బా, వజ్రం, కొబ్బరి చెట్టు, బెండకాయ, నల్లబోర్డు, బకెట్ తదితర గుర్తులను కేటాయించారు. అదే విధంగా వార్డు సభ్యుల గుర్తులను కూడా ఖరారు చేసింది. పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, గౌను, విజిల్, కుండ, గరాటా, కూకుడు, డిష్, యాంటీనా, ఐస్‌క్రీం, గానుగ్లాసు, పోస్టు డబ్బా, కవర్, కటింగ్ ప్లేయర్, హాకీ, కర్రబంతి, నెక్‌టై, విద్యుత్ స్తంభం, కేటిల్ తదితర గుర్తులను ఖరారు చేసింది. వీటితో పాటు నోటా గుర్తు కూడా ఉంటుంది.

పిల్లిది ప్రాణం కాదా..

- అల్లారుముద్దుగా పెంచుకున్నాం..
- తినడం లేదని ఆస్పత్రికి తెస్తే చంపేశారు
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- ఆరోపించిన బాధితులు
- పరస్పరం పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన పిల్లి ఇదే..

చేవెళ్ల: 'ప్రాణం ఎవరిదైనా ఒకటే.. పిల్లిది అయితే ప్రాణం కాదా.. అల్లారు ముద్దుగా ఐదునెలలుగా పెంచుకుంటున్నాం.. అది ఇప్పుడు ఇంట్లో లేదంటే ఎంతో బాధగా ఉంది.. ఏమీ తినడం లేదని ఆస్పత్రికి వస్తే ఏవో మందులు ఇచ్చి చంపేశారు' అంటూ ఓ మహిళ కంటతడిపెట్టుకుంది. ఈ సంఘటన చేవెళ్లలో మంగళవారం చోటు చేసుకుంది. నగరానికి చెందిన పాజియా బేగం పిల్లలతో కలిసి కొంత కాలంగా చేవెళ్లకు వచ్చి స్థిరపడింది. ఐదు నెలల కిత్రం ముచ్చటపడి పిల్లిపిల్లను తెచ్చుకుంది. ఇంటిల్లిపాదీ దానిని అపురూపంగా చూసుకోవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో రెండు రోజులుగా అది ఏమీ తినకపోవడంతో చేవెళ్లలోని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి సిబ్బంది ఇంజెక్షన్ ఇచ్చి, ఓ మందు తాగించి పంపించారు. ఇంటికి వెళ్లిన కాసేపటికి పిల్లి ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకుంటూ అడ్డం పడిపోయింది. మళ్లీ ఆస్పత్రికి తీసుకురాగా వైద్య సిబ్బంది వైద్యం అందిస్తుండగా అది మృతి చెందింది. దీంతో పాజియా బేగం, ఆమె కుమారుడు అక్బర్ సిబ్బందితో గొడవకు దిగారు. అల్లరుముద్దుగా పెంచుకుంటున్న పిల్లి వైద్యం వికటించి మృతి చెందిందని.. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. సరైన వైద్యం చేయకపోవడంతోనే పిల్లి చనిపోయిందని వైద్యం చేసిన సిబ్బందిపై ఫిర్యాదు చేశారు.

విచారణకు ఆదేశం

పిల్లికి అనారోగ్యంగా ఉండడంతో నయం చేసేందుకు వైద్యసిబ్బంది ప్రయత్నించారని చేవెళ్ల వెటర్నరీ వైద్యుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ముందుగా వచ్చినప్పుడు ఆస్పత్రిలో ఉండే కాంట్రాక్ట్‌పై పనిచేసే సబార్డినేట్ దేవేందర్ నట్టల మందు, జ్వరం మందు వేసి పంపించాడని.. తరువాత మళ్లీ పరిస్థితి విషమంగా ఉందని రాగా చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయంపై జేడీ విజయ్‌కుమార్‌కు సమాచారం అందించామని ఆయన ఆలూరు వైద్యులతో బుధవారం పోస్టుమార్టం చేయించాలని.. ఏం జరిగిందో విచారణ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. కాగా తనపై దాడి చేశారని దేవేందర్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పార్టు టైం అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమ్మదనం బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గణితం, బాటనీ, ఫిజిక్స్, బయోసైన్స్ బోధించేందుకు జూనియర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాసుదారులు ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలని, ఈనెల 10వ తేదీలోపు కళాశాలలో అందజేయాలని ఆమె సూచించారు.

'గ్రీన్‌ఫీల్డ్' పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ముంతాజ్

కడ్తాల్: ఓఆర్ఆర్ నుంచి ఫోర్త్‌సిటీ మీదుగా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ మార్కింగ్ పనులను రైతులు అడ్డుకున్నారు. ఎక్వాయిపల్లి శివారులో రోడ్డు నిర్మాణ పనులకు భూ సేకరణ కోసం రెవెన్యూ అధికారులు మంగళవారం మార్కింగ్ ప్రక్రియ మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల పరిధిలో భూములు కొల్పోతున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సమాచారం లేకుండా, రైతులకు నోటీసులు ఇవ్వకుండా సర్వే చేపట్టడం ఏమిటని నిలదీశారు. రోడ్డు నిర్మాణంతో ఉన్న ఎకరం, అర ఎకరం పోతే ఎక్కడికెళ్లి బతకాలి, ఎలా బతకాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ ముంతాజ్ అక్కడికి చేరుకున్నారు. ఇది ప్రాథమిక సర్వే మాత్రమే అని, సర్వేను అడ్డుకోవడం తగదని రైతులకు సూచించారు. సర్వేకు సంబంధించి సమాచార నోటీసును ముద్వీన్ రెవెన్యూ పంచాయతీ నోటీస్ బోర్డులో అతికించామని, పత్రికల్లో ప్రకటన సైతం ఇచ్చామని తెలిపారు. ముద్వీన్ గ్రామ పంచాయతీలో నోటీస్‌లు అందిస్తే తమకెలా తెలుస్తుందని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. ఈ మేరకు ఆ గ్రామా పంచాయతీల్లోనూ నోటీసులు అతికించాలని అధికారులకు తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో సీఐ శివ ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ జోగువీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్ సిటీ'.. పోలీసుల పోటీ!

- ఫోర్త్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు
- శివారు జోన్, డివిజన్ ఖాకీల పోస్టులకు డిమాండ్
- మహేశ్వరం, యాదాద్రి- భువనగిరి, శంషాబాద్‌లకు ప్రాధాన్యం
- వికారాబాద్, మెదక్ పోస్టులకూ పైరవీలు ముమ్మరం
- నేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు



సాక్షి, సిటీబ్యూరో: పోలీసు వర్గాల్లో ప్రస్తుతం 'ఫోర్త్ సిటీ' హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించిన క్రమంలో.. శివారు ప్రాంతాల్లోని జోన్, డివిజన్ పోలీసు పోస్టులకు డిమాండ్ విపరీతంగా ఏర్పడింది. ఫోర్త్ సిటీ ప్రతిపాదనతో శివార్లలో రియల్ ఎస్టేట్ బూమ్ ఊపందుకోవడంతో ఇదే అదనుగా పలువురు పోలీసు ఉన్నతాధికారులు వారి 'ఫ్యూచర్'ను చక్కదిద్దుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. త్వరలోనే ఖాకీల బదిలీలు జరగనున్న నేపథ్యంలో ఆశావహులు ప్రభుత్వంలోని ప్రముఖులను, నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఖాకీలు, బిల్డర్లు.. చెట్టాపట్టాల్..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యువత అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఆధునిక టెక్నాలజీ హబ్‌గా నిర్మించాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే నాలుగో నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడికల్ టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలకు ప్రాతినిధ్యమిస్తున్నారు.

- బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల ప్రాంతాల్లో రానున్న ఫోర్త్ సిటీ కోసం ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించింది. మరో 15 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ చేయనుంది. స్థిరాస్తి నిపుణుల అంచనా ప్రకారం ఫోర్త్ సిటీ ప్రతిపాదన తర్వాత ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు 30- 40 శాతం మేర పెరిగాయి.
- ముచ్చర్ల, దాసర్లపల్లి, కడ్తాల్, నేదునూరు, కందుకూరు, మీర్‌ఖాన్‌పేట, తుమ్మలూరు, మహేశ్వరం, గూడూరు, పంజగూడ, నాగిరెడ్డిగూడ, మక్త మాదారం, ఆమనగల్లు, యాచారం ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పెరిగింది. రియల్టర్లతో పోలీసులు సత్సంబంధాలు కొనసాగిస్తారనే అభిప్రాయం ఉంది. దీంతో తమ అనుయాయులు పోస్టింగ్‌ల్లో ఉంటే స్థిరాస్తి క్రయవిక్రయాలు, తగాదాల్లో ఇబ్బందులు తలెత్తవని పలువురు బిల్డర్లు భావిస్తున్నారు.

జోన్, డివిజన్ పోస్టులకు పైరవీలు..

మహేశ్వరం మండలంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేయడంతో.. శివారు ప్రాంతాల్లోని జోన్, డివిజన్ పోలీసు పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. మహేశ్వరం, యాదాద్రి- భువనగిరి, శంషాబాద్ డీసీపీలతో పాటు మెదక్, వికారాబాద్ ఎస్పీ పోస్టింగ్‌లకు ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా ప్రాంతాలకు కొత్త పోలీసు బాస్‌లను నియమించినప్పటికీ.. ఏడాది కాలం పూర్తవడంతో బదిలీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీంతో ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మహేశ్వరం జోన్ పరిధిలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం డివిజన్లతో పాటు ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) పోస్టులకు పైరవీలు తుది దశకు చేరుకున్నాయి.

ఫ్యూచర్‌కు డైనమిక్ ఐఏఎస్

ఫోర్త్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళికలు, భారీ ప్రాజెక్టును పర్యవేక్షించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందనం, రెవెన్యూ శాఖల్లోని పలువురు డైనమిక్ ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగించేందుకు త్వరలోనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ, భద్రత, నిర్వహణ కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ అథారిటీ కార్యాచరణ, విధి విధానాలు ఉండనున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులివ్వండి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిలో మార్చురీ, మోడ్రన్ కిచెన్, మెకానికల్ లాండ్రీ, కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు, పార్కింగ్ షెడ్, బయోమెడికల్ వేస్టేజీ భవన నిర్మాణానికి అదనంగా రూ.5.31 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేశంపేటలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రులకు రూ.22.80 లక్షలు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హెచ్‌ఎంపై దాడి ఘటనలో కేసు దర్యాప్తు

పహాడీషరీఫ్: తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడి ఘటనపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డిసెంబర్ 21న పాఠశాలలో రాములుపై అవమానకరంగా వ్యవహరించిన ఘటనపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసినట్లుగా కేసు నమోదయింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

బ్యాటరీలు చోరీ

యాచారం: ఇంటి ఎదుట పార్క్ చేసిన ట్రాక్టర్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు చోరీ చేశారు. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి ఉట్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణంరాజు తెలిపిన ప్రకారం.. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన చెన్నయ్య, అశోక్, భిక్షపతి, వినోద్ తమ ఇంటి ఎదుట ట్రాక్టర్లు పార్క్ చేశారు. గుర్తు తెలియని ఆయా ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ ఠాణా పరిధిలో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ దేవేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు ఆటోలు, 13 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సూచించారు. ఆసక్తి గల వారు స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలించుకోవాలని సూచించారు.

దిండుతో అదిమిపట్టి.. ఊపిరాడకుండా చేసి

భర్తను కడతేర్చిన భార్య

ఇబ్రహీంపట్నం రూరల్: కట్టుకున్న భర్తనే కడతేర్చింది.. తన నుదిటిబొట్టును తానే తుడిచేసుకుంది. భర్త ముఖంపై దిండుతో ఊపిరాడకుండా చేసి అంతమొందించింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, గొల్లవూరు గ్రామానికి చెందిన షణ్ముఖరావు(51), ఉమాపతి దంపతులు. ఆరు నెలలుగా తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం షణ్ముఖరావు పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. అంతా వచ్చి వీరింట్లోనే పడుకున్నారు. కూలి పనికి వెళ్లి వచ్చిన ఉమాపతి గమనించి భర్త స్నేహితుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు వచ్చి తమ వాళ్లను తీసుకెళ్లారు. వారు వెళ్లిన వెంటనే భార్యాభర్తలు గొడవ పడ్డారు. అప్పటికే ఇద్దరూ మద్యం తాగి ఉన్నారు. కాసేపటికి షణ్ముఖరావు పడుకోగా భార్య ఉమాపతి దిండుతో అతడి ముఖంపై అదిమిపట్టి ఊపిరాడకుండా చేసింది. ఆ తర్వాత పడుకుండిపోయింది. మంగళవారం ఉదయం 7 గంటలకు మేస్త్రీ ఇంటికి వచ్చి తలుపుతట్టగా ఉమాపతి లేచింది. అప్పటికే షణ్ముఖరావు మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, క్లూస్ టీం స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలాడు

కేశంపేట: అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కందాడ కృష్ణయ్య(64) ఈ నెల 1న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు నర్సింలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం గ్రామ శివారులోని మొదుంబావిలో శవాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఆరుగురు



క్రీడాకారులతో కోచ్ మోహన్

హుడాకాంప్లెక్స్: జాతీయ వాలీబాల్ పోటీలకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అకాడమీ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ మోహన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడహక్ బాడీ నిర్వహిస్తున్న సీనియర్ వాలీబాల్ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడమే ధ్యేయంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సీనియర్ వాలీబాల్ పురుషుల జట్టుకు బి.మధు, సిరిల్‌రెడ్డి, పరహాన్‌ఖాన్, హబీబ్, ప్రశాంత్, మహిళల జట్టుకు హారిక ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను సన్మానించిన వారిలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు రవిందర్, చంద్రారెడ్డిలు ఉన్నారు.

ప్రభుత్వం పేదల పక్షమే

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- ఎమ్మెల్యే దానంతో కలిసి గురుబ్రహ్మనగర్ బస్తీ పర్యటన



గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్: ప్రభుత్వం పేద ప్రజల పక్షానే ఉంటుందని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే పని చేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ కాలనీని ఆనుకొని ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటించారు. హైడ్రా ఏర్పాటైన తొలినాళ్లలో ఇక్కడ పార్కు ప్రహరీ నిర్మాణం ఘటన వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే. నాటి ఘటనలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు బస్తీవాసులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పర్యటన స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎమ్మెల్యేతో కలిసి బస్తీ మొత్తం కలియతిరిగారు. చుట్టూ జరుగుతున్న కబ్జాలతో పాటు బస్తీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. 2011లోనే ఇక్కడి బస్తీకి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. బస్తీకి మొత్తంగా ఒక ఎకరా 25 గుంటల స్థలం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయని, త్వరలోనే ఇక్కడ క్షేత్రస్థాయిలో డీజీపీఎస్ సర్వే చేయిస్తామని తెలిపారు. ఆ తర్వాత పక్కన పార్కు స్థలం గురించి ఆలోచిస్తామన్నారు. బస్తీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి అనుకూలంగా పార్కును అభివృద్ధి చేసే పనులు చేపడతామని తెలిపారు. కొన్ని చోట్ల కాలనీవాసులు పార్కును అడ్డంపెట్టుకొని కబ్జాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని త్వరలోనే వాటిపై విచారణ చేస్తామని అన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, కాలనీ లే అవుట్‌లకు చాలా తేడాలున్నాయని, త్వరలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పేదల బస్తీకి న్యాయం చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. అధికారులకు, ప్రజాప్రతినిధులకు సంబంధం లేకుండా కాలనీ అసోసియేషన్ వారు సీఎస్‌ఆర్ కింద పార్కును అభివృద్ధి చేస్తామంటూ బస్తీవాసులను ఇబ్బందులకు గురి చేశారని.. అందుకే ఆ రోజు బస్తీవాసులు ప్రహరీ నిర్మాణంపై తిరగబడ్డారని చెప్పారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్లీ చిన్నది.. గరీబోళ్ల కథ పెద్దది!

‘ఎట్ల బతుకుతున్నరయ్యా ఈ బస్తీలో.. సరిగా నడవడానికి సైతం బాటల్లేవు.. నిలబడే జాగా లేదు.. ఇరుకు సందులు.. మురికి కూపాలు’ అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిసెల మధ్య ఉన్న మురికి కాల్వల మీదుగా.. ఇరుకు సందుల నుంచి బయటకి వస్తూ.. ‘ఇదేం సందయ్యా.. నేనంటే సన్నగా ఉన్నాను కాబట్టి ఇందులో నుంచి రాగలిగాను. అదే కొంచెం దొడ్డుగా ఉన్నోడి పరిస్థితి ఏంది? అసలు ఇక్కడ ఎలా ఉండగలుగుతున్నారయ్యా’ అంటూ బస్తీవాసుల పరిస్థితిని చూసి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ‘గల్లీ చిన్నది.. గరీబోళ్ల కథ పెద్దది.. అనే పాట విన్నదే కానీ ఇప్పుడు నాకు ప్రత్యక్షంగా కనిపించింది’ అంటూ ముందుకు సాగారు.



ఇరుకు సందులోంచి బయటికి వస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING & CONSTRUCTION

■ కేవలం 1650/-లకే Per Sft. నాణ్యమైన మెటీరియల్‌తో, 100% వాస్తు, క్వాలిటీ ఇంజినీర్లచే మీకు నచ్చిన రీతిలో ఇండ్లు, బిల్డింగ్‌లు కట్టి ఇవ్వబడును. 63033 22780 [HA-99493]

LAND FOR SALE

■ మన తెలంగాణలో కొల్లాపూర్ తిరుపతి హైవే & బెంగుళూర్ హైవేలో ఫాంలాండ్ శ్రీగంధం మొక్కలతో, 1/2 అర ఎకరము భూమి కేవలం 15 లక్షలు మాత్రమే. 9177619716 [SCA25001060]

PLOT FOR SALE

■ Open Plot for Sale at Nagole 1km from Lucky Restaurant 200 sq yards 30x60 South Face. Call : 8686299996 [SCA25001044]

TO-LET

■ మియాపూర్, మయూరినగర్‌లో 2BHK, 1150-Sft, సెమీఫర్నిషెడ్ & విండోస్ విత్ మెష్ ఇల్లు అద్దెకు ఇవ్వబడును. Ph: 9963999252 [SCA24000952]

Services

BUSINESS SERVICE

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA25001023]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800523]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Shaik Meh Munnisa Begum D/o MD Azmathullah (old name) H.No. 24-776/1, Panchasheela Colony Near Pragathi High School, Quthbullapur mandal, Medchal-malkajgiri dist, Telangana -500037. Have changed my Name to MIMUNA BEGUM W/O SHAIK MOULANA (New Name) for Records purpose [SCA25001110]

■ I, IQBAL S/o ABDUL KHADAR VALI R/o F.No.:103, Plot No. 6/33/34 Vishal Nagar, AN Heights, Hydershakote, Hyd, T.S - 500091 Changed my Name as "ABDUL IQBAL S/o ABDUL KHADAR VALI" For all purposes. [SCA25001109]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, [H-783366]

TOURS & TRAVELS

■ 8/5 చార్ధాంయాత్ర, సరస్వతి పుష్కరాలు. జూన్‌లో యమునోత్రి, గంగోత్రి, కేదార్, బద్రీనాథ్, జూలైలో పవిత్రకాశ్మీర్, అమర్నాథ్ యాత్ర.ఫోన్: 9849747093, 8121682275 [SCA24000980]

Wanted

■ వంట, ఇంటిపని పిల్లలను పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్ టేకర్స్ పంపబడును. 6309807798, 9121099519 స్త్రీ/పు వర్కర్స్ కావలెను. [SCA25001069]

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-2]

■ గుజరాత్‌లోని మార్వాడి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q: డిగ్రీ. 9440096691, 9705216479 [SCA25001045]

■ లేడీ టె.కా, డాటా ఎంట్రీ, (హోమ్ బేస్డ్) DTP, వీడియో ఎడిటర్లు, కలెక్షన్, అ-బాయ్స్, యాంకర్స్, డ్రైవర్లు, సూ॥వై, హెల్పర్స్. జీ: 10-18K, ఫ్రీ హాస్టల్ + ట్రైనింగ్. 7780468727 [SCA25001099]

■ Wanted Commercial Vehicle Driver for Ashok leyland in Shamirpet Turkapally Contact number 9866176688 [HA-6209]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | **జోన్ సెంటర్స్**

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

రమణారెడ్డికి ఉత్తమ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

హుడాకాంప్లెక్స్: విద్యారంగంలో అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించిన ఆర్‌ఆర్ అపోలో మెడికల్ అకాడమీ చైర్మన్ రమణారెడ్డి ఉత్తమ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. మంగళవారం హైబిజ్ టీవీ, టీవీ5 సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాంత బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్.ప్రీతిరెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య చేతుల మీదుగా హైటెక్ సిటీలోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణారెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇదే ఉత్సాహంతో మరింత మంది పేద విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించేలా బోధన అందిస్తానన్నారు.



అవార్డు అందుకుంటున్న రమణారెడ్డి

బతుకమ్మ కుంటపై హైకోర్టు కీలక తీర్పు



అధికారులను సన్మానించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

నల్లకుంట: అంబర్‌పేట పరిధిలోని బతుకమ్మకుంట విషయంలో మంగళవారం హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ వివాదంపై వాదోపవాదనలు విన్న హైకోర్టు..ఎడ్ల సుధాకర్ రెడ్డి బతుకమ్మ కుంట స్థలం తనదేనంటూ వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. ఆ స్థలాన్ని బతుకమ్మ కుంటగానే గుర్తిస్తూ తుది తీర్పునిచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హైడ్రాను సంప్రదించడంతో పాటు అందుకు సంబంధించిన పత్రాలను కూడా అందజేశారు. ఈ మేరకు చెరువుల పునరుద్ధరణలో భాగంగా గతేడాది నవంబర్ 13వ తేదీన హైడ్రా కమిషనర్ రంగనాథ్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను సందర్శించారు. ఈ కుంటను సుందరీకరించేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి బతుకమ్మ కుంట స్థలం తనదంటూ నవంబర్ 14న హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. ఆ తర్వాత హైడ్రా, రెవిన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు సర్వే నంబర్ 563లో ఉన్న భూ రికార్డులను పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాస్కరరెడ్డి.. పిటిషనర్ ఎడ్ల సుధాకర్‌రెడ్డికి ఈ భూమిపై ఎలాంటి హక్కు లేదంటూ తీర్పునిచ్చారు. హైకోర్టు తీర్పు పట్ల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా ద్వారా బతుకమ్మకుంటకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. 1962-63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతకమ్మకుంట ఉండేది. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం 16.13 ఎకరాల విస్తీర్ణం ఉంటుందని సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి 5.13 ఎకరాల విస్తీర్ణమని తేలింది. ప్రస్తుతం ఉన్న 5.13 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుందని చెప్పారు. ప్రస్తుతం అక్కడ నివాసముంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వకాలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఒకప్పటి ఎర్రకుంటనే బతుకమ్మకుంటగా మారిందని స్థానికులు, రెవెన్యూ రికార్డులు కూడా చెబుతున్నాయి. కాగా బతుకమ్మకుంట సుందరీకరణ పూర్తయితే చెరువు నీటితో కళకళలాడి..పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పడనుంది.

అధికారులకు సన్మానం

బతుకమ్మకుంటపై ప్రభుత్వం తరపున సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించి.. కోర్టు నుంచి అనుకూలంగా తీర్పు రావడంలో కృషి చేసిన హైడ్రా లీగల్ బృందం, రెవెన్యూ ఉద్యోగులను మంగళవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ సన్మానించారు. హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ కె.రవీందర్‌రెడ్డి, సీహెచ్.జయకృష్ణ, హైడ్రా న్యాయ సలహాదారు శ్రీనివాస్, హైడ్రా లీగల్ విభాగం లైజనింగ్ అధికారి డి.మోహన్, హైడ్రా డిప్యూటీ కలెక్టర్ ఎల్.సుధ, తహసీల్దార్లు ఎం.హైమమాలిని, పి.విజయ్ కుమార్, అంబర్‌పేట తహశీల్దార్ వీరాబాయి. సర్వేయర్ కిరణ్ తదితరులు సన్మానం అందుకున్నారు.

ఐటీ టవర్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జైపాల్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధి విజయవాడ జాతీయ రహదారికి చేరువలో ఐటీ టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు కౌన్సిలర్లు, నాయకులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే దినదినాభి వృద్ధి చెందుతున్న మున్సిపాలిటీ పరిధిలో ఐటీ టవర్లు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత అభివృద్ధితో పాటుగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు లేఖ రాశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, శంకరయ్యగౌడ్, నాయకులు రాజు, విజయేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అవినీతికి బీజేపీ అండ

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

షాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు కేంద్రంలోని బీజేపీ అండగా నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బండ శ్రీకాంత్‌గౌడ్(కిట్టు) జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు మంత్రి తుమ్మల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హామీల అమలుకు కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.



శ్రీకాంత్‌గౌడ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల

సెప్టెంబర్‌లో అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

కంటోన్మెంట్: వచ్చే సెప్టెంబర్ వరకు అల్వాల్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో కలిసి అల్వాల్‌లో నిర్మాణంలో ఉన్న భవనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా నిర్మాణంలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. అయినా ప్రస్తుతానికి 90% నిర్మాణం పూర్తయిందన్నారు. అల్వాల్ పెన్ ఆవరణలోనూ ధర్మశాల నిర్మాణం చేపట్టాల్సిందిగా అధికారులకు సూచించినట్లు చెప్పారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని లక్ష్యంతోనే టిమ్స్ ఆస్పత్రులను నిర్మిస్తున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రి మూతపడగా గాంధీ ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువైందన్నారు. మూడు టిమ్స్ ఆస్పత్రులు అందుబాటులోకి వస్తే ప్రజలకు వెసులుబాటు కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామన్నారు. ప్రతిరోజూ వందలాది మందికి సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ కింద లక్షల రూపాయలు విడుదల చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే ఆరోగ్యశ్రీకి రూ.1,600 కోట్లు చెల్లించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. అల్వాల్ టిమ్స్ నిర్మాణం పూర్తయితే ఉత్తర తెలంగాణ తో పాటు కంటోన్మెంట్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.

లేడీస్ డే.. సందడే..

నుమాయిష్‌లో మహిళలు సందడి చేశారు. మంగళవారం లేడీస్ డే వేడుకలు జోరుగా నిర్వహించారు. దాదాపు 10 వేల మంది మహిళలు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు అంచనా. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. లేడీస్ డే కార్యక్రమానికి రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా హాజరై ప్రసంగించారు. దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు ధైర్య సాహసాలు నింపేలా తల్లిదండ్రులు, విద్యా సంస్థలు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, డి.సంధ్య, ఎస్.సుచరిత, సీతా మిశ్రా, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్







